'మీ-కోసం'ను సద్వినియోగించుకోండి: కలెక్టర్

శ్రీకాకుళం, మే 11(ఆంధ్రజ్యోతి): జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించనున్న ప్రజాఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక.. 'మీ-కోసం' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'జిల్లా ప్రజలు తమ సమస్యలను తెలియజేసి.. పరిష్కారాన్ని పొందాలి. అర్జీల నమోదుకు మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను ఉపయోగించుకోవాలి. అర్జీల పరిస్థితికి సంబంధించిన సమాచారాన్ని 1100కి ఫోన్ చేసి నేరుగా తెలుసుకోవచ్చు'ని కలెక్టర్ తెలిపారు.

ఎప్పుడు ఫినిష్ చేస్తారో?

- నత్తనడకన ఫిష్ ల్యాండింగ్ పనులు
- ఐదేళ్లలో 30శాతం కూడా పూర్తికాని వైనం
- వైసీపీ హయాంలో విడుదల కాని నిధులు
- ప్రస్తుత ప్రభుత్వంపైనే మత్స్యకారుల ఆశలు



ఉప్పుటేరు ఒడ్డునే నిలిపిన బోట్లు

వజ్రపుకొత్తూరు, మే 11(ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు మండలంలోని నువ్వలరేవు- మంచినీళ్లపేట సముద్ర తీరంలో చేపడుతున్న ఫిష్ ల్యాండింగ్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు ప్రారంభించి ఐదేళ్లు గడుస్తున్నా ఇంకా 30శాతం కూడా పూర్తికాలేదు. గత వైసీపీ ప్రభుత్వం నిధుల విడుదలలో జాప్యం చేయడంతో పనులు ముందుకు కదల్లేదు. దీంతో ప్రస్తుత ప్రభుత్వంపైనే మత్స్యకారులు ఆశలు పెట్టుకున్నారు.

ఇదీ పరిస్థితి..

సముద్రంలో వేటాడిన చేపలను నిల్వ ఉంచి, డిమాండ్ ఉన్న సమయంలో మంచి ధరకు వాటిని అమ్మకాలు చేసుకునేందుకుగాను నువ్వలరేవు- మంచినీళ్లపేట తీరంలో ఫిష్ ల్యాండింగ్ నిర్మాణానికి గత వైసీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2020 జూన్‌లో అప్పటి మంత్రి హోదాలో సీదిరి అప్పలరాజు భూమిపూజ చేశారు. రూ.11.95కోట్లు వ్యయంతో ఏడాదిన్నరలోపే పనులు పూర్తి చేసి, మత్స్యకారులకు అప్పగిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. అయితే, బిల్లుల కోసం అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో పనులను నిలిపేశాడు. ఫిష్ ల్యాండింగ్‌ను జట్టీగా మార్చేందుకు ప్రతిపాదనలు చేస్తున్నామని, అందువలనే పనులు ఆలస్యమవుతున్నట్టు వైసీపీ నాయకులు (మిగతా 7వ పేజీలో..)

వైసీపీ ప్రభుత్వమే కారణం



గత వైసీపీ ప్రభుత్వం నిధులను సకాలంలో విడుదల చేయకపోవడంతో ఫిష్ ల్యాండింగ్ పనులు పూర్తికాలేదు. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు మధ్యలోనే ఆపేశాడు. పనులు పూర్తిచేసి మత్స్యకారులను ఆదుకోవాలని ఎమ్మెల్యే గౌతు శిరీషకు విజ్ఞప్తి చేశాం.

- వెంకటేష్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు, నువ్వలరేవు

మినీ జట్టీయే ఆధారం



టీడీపీ ప్రభుత్వ హయాంలో కేంద్రమంత్రిగా ఉన్న కింజరాపు ఎర్రన్నాయుడు నువ్వలరేవు తీరంలో మినీ జెట్టీని నిర్మించారు. అదే ఇప్పటికీ మత్స్యకారులకు ఎంతో ఉపయోగపడుతోంది. ఇక్కడే చేపలు నిల్వ ఉంచి వ్యాపారులకు అమ్మకాలు చేస్తున్నారు. ఫిష్ ల్యాండింగ్ పనులు పూర్తయితే మత్స్యకారులకు మరింత ఉపయోగంగా ఉంటుంది.

- ఆనంద్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు

పనులు పూర్తిచేస్తాం

నిధుల కేటాయింపు జరగకపోవడంతో ఫిష్ ల్యాండింగ్ పనులు ఆలస్యమయ్యాయి. ప్రస్తుతం నిర్మాణ వ్యయం పెరిగింది. అంచనావ్యయాన్ని రూ.11.95 కోట్లు నుంచి రూ.13.95 కోట్లుకు పెంచుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదలయితే పనులు పూర్తి చేస్తాం.

- సత్యనారాయణ, డీడీ, మత్స్యశాఖ



నువ్వలరేవు వద్ద నిలిచిన ఫిష్ ల్యాండింగ్ పనులు

'కూర్మా'న్ని కష్టకాలం

- శ్రీకూర్మంలో అనారోగ్యానికి గురవుతున్న తాబేళ్లు
- వైజాగ్ జూకి వంద తరలింపు
- పార్కులో మిగిలిన వాటికి సంరక్షణ చర్యలు



శ్రీకూర్మం క్షేత్రంలో తాబేళ్ల పార్కు

గార, మే 11(ఆంధ్రజ్యోతి): గార మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీకూర్మంలో తాబేళ్లకు కష్టకాలం ఎదురవుతోంది. ఈ క్షేత్రంలోని పార్కులో ఉన్న తాబేళ్లు కొన్ని ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వంద తాబేళ్లకు ప్రత్యేక వైద్యం అందించి.. వాటిని పరిరక్షించేందుకు అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇటీవల ఇక్కడ కొన్ని తాబేళ్లు మృత్యువాత పడ్డాయి. ఎమ్మెల్యే గొండు శంకర్, అటవీ శాఖ, పశువైద్య శాఖ అధికారులు ఆ తాబేళ్లను పరిశీలించారు. ఈ నెల 4న ఇక్కడ పార్కులో ఆరోగ్యం సరిగా లేని వంద తాబేళ్లను గుర్తించారు. వాటికి మెరుగైన వైద్య సేవలు అందించడానికి వైజాగ్ జూలో యానిమల్ రెస్క్యూ సెంటర్‌కు తీసుకెళ్లారు. అక్కడ వాటికి వైద్య సేవలు అందిస్తున్నారు. ఎక్కువ తాబేళ్లకు నోటి నుంచి నురగ వస్తుండడంతో అవి ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నట్టు అటవీ శాఖ, పశువైద్య శాఖ అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం పార్కులో ఉన్న 211 తాబేళ్లను రోజూ ఆలయ అధికారులు పర్యవేక్షిస్తూ సంరక్షణ చర్యలు చేపడుతున్నారు.

విశాలమైన స్థలం అవసరం

శ్రీకూర్మంలో పదేళ్ల కిందట తాబేళ్ల పార్కు ఏర్పాటు చేశారు. అప్పట్లో ఉన్న (మిగతా 8వ పేజీలో..)

సంరక్షిస్తున్నాం

అటవీ శాఖ, పశువైద్య శాఖాధికారులు పరిశీలించి.. వంద తాబేళ్లను జూ పార్కుకి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఇక్కడ ఉన్న 212 తాబేళ్లను సంరక్షిస్తున్నాం.

- కె.నరసింహనాయుడు, ఈఓ, శ్రీకూర్మం



మొక్కనాటి నీరు పోస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి

పర్యావరణాన్ని పరిరక్షించాలి

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి

శ్రీకాకుళం లీగల్, మే 11(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని అందరూ పరిరక్షించాలని హైకోర్టు న్యాయమూర్తి, శ్రీకాకుళం జిల్లా పోర్టుఫోలియో న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం శ్రీకాకుళంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయాధికారి జునైద్‌అహ్మద్ మౌలానాతో కలిసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'పర్యావరణ సమతుల్యతకు మొక్కలు దోహదపడతాయి. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి' అని తెలిపారు. మొక్కలను సీనియర్ న్యాయవాది సుభాష్ అందజేశారు. కార్యక్రమంలో న్యాయాధికారులు పి.భాస్కరరావు, వివేకానంద శ్రీనివాస్, ఫణికుమార్, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తంగి శివప్రసాద్, ప్రధానకార్యదర్శి పిట్టా దామోదర్, ఉపాధ్యక్షుడు సీతరాజు, మహిళా ప్రతినిధి గురుగుబెల్లి వనజాక్షి, సీనియర్ న్యాయవాదులు మెట్ట సత్యనారాయణ, బైరి దామోదర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ

సిక్కోలు.. సాహిత్యవేత్తలకు నిలయం

- జాతీయ ఉత్తమ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ

గుజరాతీపేట, మే 11(ఆంధ్రజ్యోతి): 'పోరాటాలకు, సాహిత్యవేత్తలకు ప్రాణం పోసిన గడ్డ శ్రీకాకుళం. ఈ జిల్లా నుంచి ఎంతోమంది కవులు రాణించార'ని జాతీయ ఉత్తమ సినీ గేయ రయయిత, తెలుగు సాహిత్యకారుడు సుద్దాల అశోక్ తేజ అన్నారు. ఆదివారం శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిరంలో సాహితీ స్రవంతి, శ్రీకాకుళ సాహితీ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీశూద్రగంగ కావ్య గాన సభ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. 'శ్రీకాకుళం అంటేనే సూర్యగోళమని నా తండ్రి, కవి అయిన సుద్దాల హనుమంతు నాకు చిన్నప్పుడు చెప్పేవారు. పోరాటాల గడ్డగా అభివర్ణించేవారు. నా తండ్రి నుంచి (మిగతా 7వ పేజీలో..)

శభాష్.. భరత్‌చంద్ర

- తెలంగాణ ఈఏపీసెట్‌లో 'మన్యం' విద్యార్థికి ప్రథమ ర్యాంకు
- ప్రతిభ చూపిన గుణానుపురం విద్యార్థి

జియ్యమ్మవలస/ శ్రీకాకుళం అర్బన్, మే 11(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం గుణానుపురం గ్రామానికి చెందిన పల్లా భరత్‌చంద్ర తెలంగాణ ఈఏపీసీఈటీలో(ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) ఇంజనీరింగ్ విభాగంలో ప్రతిభ చూపాడు. మొత్తంగా 99.99 శాతం మార్కులతో మొదటి ర్యాంకు సాధించాడు. భరత్‌చంద్ర జేఈఈ మెయిన్స్ 2025లో ఆలిండియా 121వ ర్యాంకు, ఆలిండియా ఓబీసీ కోటాలో 17వ ర్యాంకు సాధించాడు. 2013-18 వరకు అనకాపల్లిలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో ఒకటి నుంచి 5 వరకు చదివాడు. 2018-23లో కృష్ణా జిల్లా గుడివాడలో ఉన్న ఓ ప్రైవేటు స్కూల్‌లో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివాడు. టెన్త్‌లో 575 మార్కులు సాధించాడు. 2023-25 వరకు ఇంటర్మీడియట్(ఎంపీసీ)ను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్‌లో చదివి 961మార్కులు సాధించాడు. జేఈఈలో మంచి ర్యాంకు సాధించాలనే లక్ష్యంతో చదివిన భరత్‌చంద్ర ఇంటర్నేషనల్ ఒలింపియాడ్‌కు మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ మూడు (మిగతా 8వ పేజీలో..)



భరత్‌చంద్రకు స్వీట్ తినిపిస్తున్న తల్లి దమయంతి

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ

- 56 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు

నరసన్నపేట, మే 11(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 20 వరకూ జరగనున్నాయి. ఈ ఏడాది మార్చిలో రెగ్యులర్ పరీక్షలు నిర్వహించారు. అందులో ఫెయిలైన వారితోపాటు ఉత్తీర్ణులైన విద్యార్థులు కూడా ఆయా సబ్జెక్టుల్లో మరిన్ని మార్కులను సాధించేందుకుగాను సప్లిమెంటరీకి హాజరుకానున్నారు. జిల్లాలో 56 కేంద్రాల్లో ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. 38 కేంద్రాల్లో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ప్రథమ సంవత్సరం పరీక్షలను 9,231 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలను 6,500 మందికిపైగా రాయనున్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలో 30 స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటు చేశామని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి(ఆర్ఐవో) పి.దుర్గారావు తెలిపారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 28 పోస్టల్ కార్యాలయాల్లో జవాబు పత్రాలను డిపోజిట్ చేయాల్సి ఉందన్నారు. ఈ నెల 18 నుంచి మూల్యాంకనం ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలిపారు.



అరసవల్లిలో ఇంద్ర పుష్కరిణి వద్ద భక్తుల రద్దీ

ఆదిత్యుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

- ఆదివారం ఒక్కరోజే రూ.12.38లక్షల ఆదాయం

7లో



సైనికుల కోసం 'జనసేన' ప్రత్యేక పూజలు

బకాయి వేతనం తక్షణమే చెల్లించాలి

అరసవల్లి, మే 11(ఆంధ్రజ్యోతి): ఆశ కార్యకర్తలకు ప్రభుత్వం చెల్లించాల్సిన మార్చి నెల బకాయి వేతనం తక్షణమే చెల్లించాలని ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు కె.నాగమణి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.ధనలక్ష్మి, జి.అమరావతి డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన యూనియన్ సమావేశంలో వారు మాట్లాడారు. అన్ని జిల్లాల్లో మార్చి నెల వేతనం చెల్లించినా సరే, శ్రీకాకుళం జిల్లాలో మాత్రం అధికారుల జాప్యం వల్ల జీతం అందలేదని, అధికారులను అడుగుతున్నా సరే ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో అధికారులు రికార్డుల పని, ఆన్‌లైన్ పని రెండు రకాల పనులు చేయిస్తున్నారన్నారు.

శ్రీకూర్మ క్షేత్రంలో పండిత గోష్ఠి


పండిత గోష్ఠిలో పాల్గొన్న అర్చక బృందం

గార, మే 11(ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మంలో గల కూర్మనాథుని కల్యాణ ఉత్సవంలో భాగంగా ఆదివారం ఉదయం సదస్యం (పండిత గోష్ఠి) నిర్వహించారు. ముందుగా స్వామి వారి ఉత్సవ మూర్తులను ముఖ మండపంలో ఉంచి పూజలు చేశారు. ఈవో కె.నరసింహనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సీతారామ నరసింహచార్యులు అర్చకులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో కలుపు నివారణ

కంచిలి, మే 11(ఆంధ్రజ్యోతి): నవధాన్యాల సాగు వల్ల పంటలో కలుపు నివారించవచ్చని మండల యాంకర్ టి.శివానందం అన్నారు. అంపురం యూనిట్ పరిధిలోని జాడుపూడిలో మాజీ సర్పంచ్, టీడీపీ నాయకులు పిలక చినబాబు రెడ్డి నవరత్నాల కిట్లను రైతులకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో కామరాజు, ఐసీఆర్‌పి శ్రీదేవి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

- కవిటి, మే 11(ఆంధ్రజ్యోతి): రైతులు నవధాన్యాలు సాగు చేయడంతో నేలకు మేలు కలుగుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గోవింద్, దుర్గాప్రసాద్ అన్నారు. గొర్లెపాడు గ్రామంలో ఆదివారం నవధాన్యాలు సాగు. నేలతల్లికి బాగు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన సేంద్రియ రైతులు పి.వాసు, ఆర్.జ్యోతిలను సత్కరించారు. కార్యక్రమంలో తులసయ్య, కుమారి, చిట్టిబాబు, శ్రీదేవి, కామరాజు, సంతోషి పాల్గొన్నారు.

చదువులో రాణించాలి

కవిటి, మే 11(ఆంధ్రజ్యోతి): చదువులో మరింతగా విద్యార్థులు రాణించాలని సొండికుల సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. రాజపురం గ్రామంలో ఆదివారం ఈ ఏడాది ఇంటర్, పది తరగతుల్లో ఉత్తీర్ణత పొందిన తమ కుల విద్యార్థులను సత్కరించారు. సంఘంలో నిరుపేద విద్యార్థులను మరింత ప్రోత్సాహం ఇవ్వటమే తమ లక్ష్యమన్నారు. ఇంటర్‌లో ఉత్తీర్ణత పొందిన ఎస్.సుదీర్, పి.శృతి, పి.సాయి, ఎం.భరద్వాజ్, శ్రియా చౌదరిలను 10వ తరగతిలో ఎల్.సిరి, ఎస్.నితిన్, ఎస్.చందు, ఎస్.నవ్యశ్రీ, ఎల్.మహేష్, ఎం.మనోజ్, పి.నిఖిల్, ఎస్.కిషోర్‌లను సత్కరించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పొందూరు, మే 11(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.మన్మథరావు తెలిపారు. ఎంపీపీ కిల్లి ఉషారాణి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో పీయూసీ ఛైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొంటారని చెప్పారు. ప్రజాప్రతినిధులు హాజరు కావాలని, పూర్తి సమాచారంతో అధికారులు రావాలన్నారు.

రోడ్ సేఫ్టీ మిర్రర్లు ఏర్పాటు

ఇచ్ఛాపురం, మే 11(ఆంధ్రజ్యోతి): ప్రజల రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రధాన జంక్షన్ మలుపులు వద్ద స్థానిక జేసీఐ క్లబ్ సభ్యులు మిర్రర్లు ఏర్పాటు చేశారు. ఆదివారం సీఐ మీసాల చిన్నమనాయుడు ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ రోడ్ మలుపుల వద్ద ఎదురుగా వచ్చిన వాహనాలు కనిపించకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. కార్యక్రమంలో జేసీఐ క్లబ్ అధ్యక్షుడు కాళ్ల జయదేవ్, సభ్యులు మోహన్ వెంకటేష్, పవన్, షన్ముఖరావు, స్వరూప్, ఎం.శ్రీనువాస్, ఢిల్లేష్, రాజ్‌కమల్, మల్లి, సంతోష్, శ్యాం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యానికి గురైన కార్మికుడికి సాయం

ఎచ్చెర్ల, మే 11(ఆంధ్రజ్యోతి): అరిణాం అక్కివలసలోని శ్యాంపిస్టన్స్ ప్లాంట్- 3లో కార్మికునిగా పనిచేస్తున్న పుండ్రీతు గణేష్ ఇటీవల బ్రెయిన్ ఆపరేషన్ చేయించుకున్నారు. పరిశ్రమలో పనిచేస్తున్న తోటి కార్మికులు, ఉద్యోగులు విరాళాలుగా వసూలు రూ. 59,500 అనారోగ్యానికి గురైన ఈ కార్మికునికి ఆదివారం అందజేశారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎన్‌వీ రమణ, పి.దుర్గాప్రసాద్, పి.శ్రీనుబాబు, ఎం.సూర్యనారాయణ, పి.సురేష్ పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ లెటర్లు అందజేత

గార, మే 11(ఆంధ్రజ్యోతి): వాడాడ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బిన్నాడ గోపాలరావు ప్రమాదవశాత్తూ మరణించడంతో అతడి భార్య ఆదిలక్ష్మికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పంపిన ఇన్సూరెన్స్ రూ.5 లక్షల లేఖను అలాగే కొమరవానిపేటకు చెందిన టీడీపీ కార్యకర్త ఎం.రాజేష్ ప్రమాదవశాత్తు మరణించడంతో అతడి తల్లి జ్యోతికి కూడా ఇన్సూరెన్సు రూ.5 లక్షల చొప్పున లెటర్ల ను ఎమ్మెల్యే గొండు శంకర్ వారి ఇళ్లకు వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

తారెత్తిస్తున్న ఎండలు

- నిర్మానుష్యంగా రహదారులు
- ఇబ్బందిపడుతున్న ప్రజలు




గత కొద్ది రోజులుగా జిల్లాలో ఎండలు ముదురుపోతున్నాయి. ప్రస్తుతం అగ్నికార్తెలు ప్రారంభం కావడంతో ప్రజలు బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. ఆదివారం ఉదయం 8గంటలకే సూర్యుడు తన ప్రతాపం చూపించాడు. దీంతో 11గంటలకే చాలా ప్రాంతాల్లో రోడ్లు, బస్టాండ్లు ఖాళీగా మారిపోయాయి. ఎండతో పాటు వేడి గాలులకు ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. సాయంత్రం 6 గంటలు దాటిన ఎండ తీవ్రత తగ్గలేదు.

– టెక్కలి/ ఇచ్ఛాపురం

టెక్కలి: నిర్మానుష్యంగా ఉన్న పాతజాతీయ రహదారి

ఇచ్ఛాపురం: కర్ఫ్యూని తలపిస్తున్న బస్టాండ్ జంక్షన్

ఆదిత్యుని దర్శనానికి పోటెత్తిన భక్తులు


భక్తులతో కిటకిటలాడుతున్న క్యూలైన్లు

అరసవల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): వైశాఖమాసం ఆదివారం ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఇంద్రపుష్కరిణిలో పవిత్ర స్నానాలు ఆచరించి, స్వామివారికి క్షీరాన్నం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. గతవారం ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, స్వామివారి దర్శనం సజావుగా సాగడానికి ఆలయ అధికారులు భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఒక్కరోజు స్వామివారికి రూ.12,38,049 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.8,50,600, విరాళాల ద్వారా రూ.1,63,869, ప్రసాదాల ద్వారా రూ.2,23,580 లభించినట్టు ఈవో శోభారాణి తెలిపారు.

ఫుట్‌బ్రిడ్జి పటిష్ఠతకు చర్యలు



ఐరెన్‌పై వేసిన సిమెంట్

అరసవల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): ఆదిత్యాలయంలో సమస్యలపై ప్రచురితమైన కథనంపై ఆలయ ఈవో స్పందించి తక్షణ చర్యలు చేపట్టారు. కొత్తగా నిర్మించిన ఫుట్ బ్రిడ్జి పటిష్ఠతకు సంబంధించి, ఇనుప స్తంభాలకు సిమెంట్, ఐరన్ బోల్టుతో క్లాపింగ్ చేయించారు. అలాగే ఆదివారాలు, పర్వదినాల్లో ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం సమాచార కేంద్రం వద్ద మైక్ ద్వారా అనౌన్స్‌మెంట్ చేయించాలన్న సూచనపై ఆలయ అధికారులు స్పందించారు.

సైనికుల కోసం 'జనసేన' ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న జనసేన పార్టీ నాయకులు

అరసవల్లి, మే 11(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో భారత సైనికుల కోసం జనసేన ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, సుడా ఛైర్మన్ కొరికాన రవికుమార్ ఆధ్వర్యంలో ఆలయ అనివెట్టి మండపంలో ఆలయ అర్చకులు, వేదపండితులు సూర్య నమస్కారాలు, సౌరహోమం, నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయకృష్ణ మాట్లాడుతూ.. మనకోసం దేశ సరిహద్దుల్లో పోరాటం చేస్తున్న సైనికులు క్షేమంగా ఉండాలని, విజయంతో, చిరునవ్వుతో వెనక్కు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పాలవలస యశస్వి, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్, విజయనగరం జనసేన పార్టీ నాయకులు పత్తిగిల్లి వెంకటరావు, సంపతరావు, మండల లోకేష్, మారేష్, నారాయణరావు, నర్సింగరావు, సాయి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జవాన్ల త్యాగం మరవలేం..


నివాళులర్పిస్తున్న మాజీ సైనికోద్యోగులు

ఇచ్ఛాపురం, మే 11(ఆంధ్రజ్యోతి): దేశం కోసం తలపెట్టిన ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం చెందిన జవాన్ల త్యాగం మరవలేమని మాజీ సైనికోద్యోగుల సంఘ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం యూకాంప్లెక్స్‌లో గల సైనికోద్యోగుల కార్యాలయంలో మాజీ సైనికోద్యోగులు మౌనం పాటి వీర జవాన్లకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బీఎల్ నారాయణ, మాజీ సైనిక ఉద్యోగులు విశ్వనాథం రెడ్డి, సీఎస్ రెడ్డి, పట్నాయక్, మదన్‌మోహన్, ఎం.సాహు, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

హింసలేని సమాజమే లక్ష్యం


రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, మే 11(ఆంధ్రజ్యోతి): ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవిశంకర్ గురూజీ జన్మదినాన్ని పురస్కరించుకుని నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో ఆదివారం రక్తదాన శిబిరం జరిగింది. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సీనియర్ టీచర్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఈ కార్యక్రమానికి హాజరై రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ ఏడాది మే 13వ తేదీన గురూజీ జన్మదినాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుగుకుంటున్నామని, ఈ సందర్భంగా నిర్వహించే సేవా కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఏడాది తాను రక్తదానం చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కింజరాపు అమ్మన్నాయుడు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్లు నంబాళ్ల కల్పన, దేశళ్ల సురేంద్ర, రెడ్డి గిరిజాశంకర్, కృష్ణారావు, గిరిజ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

300 మంది అభ్యర్థుల హాజరు

అరసవల్లి, మే 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌యుడు ప్రేరణతో తన తండ్రి దివంగత ఎర్రన్నాయుడు పేరిట నిర్వహిస్తున్న 'ఎర్రన్న విద్యాసంకల్పం' కార్యక్రమంలో భాగంగా డీఎస్సీ అభ్యర్థుల కోసం శ్రీకాకుళం, టెక్కలిలో ఆదివారం మాక్ పరీక్షలు నిర్వహించారు. కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించిన ఈ మాక్ పరీక్షలకు సుమారు 300 మంది అభ్యర్థులు హాజరయ్యారు. శివానీ ఇంజనీరింగ్ కళాశాల, ఐతం కళాశాలలో ఈ పరీక్షలు జరిగాయి. కేంద్రమంత్రి మాట్లాడుతూ శ్రీకాకుళం యువతకు ప్రతిభను నూరిపోసేలా, వారికి ఉద్యోగ, విద్య అవకాశాలను అందేలా తోడుగా ఉంటామన్నారు.

బడే సుసాన్న ఎంపికపై హర్షం

ఆమదాలవలస, మే 11(ఆంధ్రజ్యోతి): సచివాలయ సంక్షేమ, విద్యా సహాయకుల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా బడే సుసాన్నను నియమించినట్టు సంఘ గౌరవాధ్యక్షుడు, సలహాదారు కూన వెంకట సత్యనారాయణ తెలిపారు. ఆదివారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర సంక్షేమ, విద్యా సహాయకుల ఉద్యోగుల సంఘం తరఫున జిల్లా అడహాక్ కార్యవర్గం ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. సంఘ కార్యదర్శిగా దున్న వేణుగోపాలరావు, సహాయక అధ్యక్షునిగా బి.రాజశేఖరం, కోశాధికారిగా కె.జగపతిబాబు, జిల్లా ఉపాధ్యక్షులుగా కెసంధ్య, ఎం.రమేష్‌బాబు, సంయుక్త కార్యదరులు వి.షన్ముఖరావు, వి.ఉపేంద్ర, టి.నరేంద్రకుమార్, కార్యదర్శులుగా మహ్మద్ అజీద్, సుధీర్ పాణిగ్రాహి, మెంబర్లుగా బి.పోలినాయుడు, పి.శంకరరావు, కె.అభిరామ్ నియమితులయ్యారు. వీరి ఎంపికపై పలువురు సంఘ ప్రతినిధులు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

కాశీవిశ్వేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ


నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠలో భక్తులు

ఆమదాలవలస, మే 11 (ఆంధ్రజ్యోతి): దూసిపేటలో కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ సహిత శివలింగ ప్రతిష్ఠాపన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఆదివారం వేద పండితులు వేద ఘోష నడుమ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గ్రామస్థుల సౌజన్యంతో శివలింగంతో పాటు సుబ్రహ్మణ్యస్వామి, నవగ్రహాల ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. ఏలూరు జడ్పీ ఛైర్మన్ గంటా పద్మశ్రీ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం సాయంత్రం మహారుద్రాభిషేకం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమాలు వేద పండితులు నిర్వహించారు.

రజత కవచ దర్శనంలో వెంకన్న స్వామి



శ్రీకాకుళం కల్చరల్, మే 11(ఆంధ్రజ్యోతి): పీఎన్ కాలనీలో ఉన్న నారాయణ తిరుమలలో వేంకటేశ్వర స్వామికి ఆదివారం రజత కవచ దర్శనంలో దర్శనం కల్పించారు. స్వామి వారిని వాహనసేవ, గరుడ వాహన సేవ, తిరువీధి నిర్వహించారు. అదేవిధంగా ఈ నెల 12న శ్రీ వెంకటేశ్వర స్వామికి పుష్ప కవచ దర్శనం, అవబృత స్నానం, పుష్పయాగ మహోత్సవం నిర్వహించనున్నట్లు నారాయణ తిరుమల నిర్వాహకులు తెలిపారు.

ఎప్పుడు ఫినిష్ చేస్తారో?

(ఐదో పేజీ తరువాయి)

కొత్తభాష్యం చెప్పడం మొదలు పెట్టారు. ఈ లోగా నిర్మాణ వ్యయం పెరిగింది. దీంతో రూ.13.95 కోట్లకు అంచనా వ్యయం పెంచుతూ అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఇప్పటివరకు వాటికి సంబంధించి నిధులు మంజూరు కాలేదు.

ప్రభుత్వంపైనే ఆశలు

ప్రస్తుతం 30శాతం పనులు జరిగాయి. మిగిలిన పనులు జరగాలంటే అంచనావ్యయం పెంచాలని అధికారులు చెబుతున్నారు. అప్పుడే ఫిష్ ల్యాండింగ్ నిర్మాణం పూర్తి చేయగలమని మత్స్యశాఖ డీడీ సత్యనారాయణ అంటున్నారు. పనులు పూర్తికాకపోవడంతో ఉప్పుటేరు ఒడ్డున బోట్లు నిలిపి ఉంచుతున్నట్లు మత్స్యకారులు చెబుతున్నారు. సముద్రంలో వేటాడిన చేపలను ఒడ్డుకు చేర్చాలంటే మధ్యలో ఉన్న ఉప్పుటేరు దాటి రావాల్సి వస్తుందని, దీంతో సముద్రపు ఒడ్డునే తక్కువ ధరకు అమ్మకాలు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిష్ ల్యాండింగ్ నిర్మాణంతో తమ సమస్యలు తీరుతాయని, ప్రభుత్వం స్పందించి పనులు పూర్తి చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.

సిక్కోలు.. సాహిత్యవేత్తలకు నిలయం

(ఐదో పేజీ తరువాయి)

సంక్రమించిన సాహిత్యాలు, గేయాలు రాయడం వలన సినీరంగంలో సుమారు మూడు వేలకు పైగా పాటలు రాశాను. ఠాగూర్ సినిమాలో రాసిన 'నేను సైతం' పాటకు ఉత్తమ సాహిత్య జాతీయ చలన చిత్ర అవార్డు రావడం గర్వకారణం. రచనా రంగం నుంచి సినీరంగం, పుస్తకాలు ప్రచురణతో ఎన్నో పురస్కారాలు అందుకున్నా'నని సుద్దాల అశోక్ తేజ తెలిపారు. అనంతరం స్వయంగా రాసిన సాహిత్యాలు చదివి, గేయాలను ఆలపించగా కవులు, కళాభిమానులు చప్పట్లతో కళా ప్రాంగణం మార్మోగింది. కార్యక్రమంలో సభాధ్యక్షుడు కె.శ్రీనివాస్, కవి అట్టాడ అప్పలనాయుడు, జి.గౌరునాయుడు, కంచరాన భుజంగరావు, కె.ఉదయ్‌కిరణ్, ఎస్.రుద్రమ రాణి, సీహెచ్ దివాకర్, కె.శ్రీనివాసరావు, రంగనాథం, కల్లేపల్లి రాంగోపాల్, పి.మోహనరావు, చింతాడ తిరుమలరావు, బాడాన శ్యామలరావు, ఎస్.రమణ, పూజారి దివాకర్ పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

పొందూరు, మే 11(ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కులు కాలరాసే లేబర్‌కోడ్లు రద్దుచేయాలని, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ కోరుతూ ఈ నెల 20న అఖిలభారత సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. మండల కేంద్రం పొందూరులో నిర్వహించిన కార్మిక సమావేశంలో సమ్మె కరపత్రాలు ఆవిష్కరించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మికచట్టాలను మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం లేబర్‌కోడ్లు మార్చివేసిందన్నారు. సమావేశంలో పలు కార్మికసంఘాలు ప్రతినిధులు పాల్గొన్నారు.

ముమ్మరంగా దాడులు

పొందూరు, మే 11(ఆంధ్రజ్యోతి): సమాజాన్ని పటిపీడిస్తున్న మాదకద్రవ్యాల రవాణాను అడ్డుకునేందుకు పోలీసులు ముమ్మరదాడులు నిర్వహించారు. స్థానిక ఎస్‌ఐ వి.తస్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసు బృందాలు పొందూరు రైల్వేస్టేషన్‌లో, ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పొందూరు మహారాజా మార్కెట్‌లోని దుకాణాలను ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ప్రయాణీలవద్ద ఉన్న సామానులను క్షుణ్ణంగా పరిశీలించారు. మాదకద్రవ్యాలు కలిగి ఉండడం తీవ్రమైన నేరమని హెచ్చరించారు.

ధ్వజ స్తంభం ప్రతిష్ఠ

పొందూరు, మే 11(ఆంధ్రజ్యోతి): మన్నెపేట కొండపై వెలసిన అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం, ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. పురోహితులు గన్నవరపు రాంబాబు, రిత్వికులు మావుడూరు సంతోష్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ఘనంగా ముగిసాయి.


ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

ధనరాజ తులసమ్మ సంబరం

ఇచ్ఛాపురం, మే 11(ఆంధ్రజ్యోతి): ధనరాజ తులసమ్మతల్లి సంబరాన్ని పట్టణ ప్రజలు అత్యంత ఘనంగా జరిపారు. ఆదివారం మండుటెండల్లో అమ్మవారి ఘటాలతో మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. బిందెలతో తీసుకెళ్లిన పానకాలు, పసుపు నీళ్లతో అమ్మవారికి అభిషేకించారు.

హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ

ఇచ్ఛాపురం, మే 11(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధి 17వ వార్డు లాలాపేటలో నూతనంగా నిర్మించిన హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా జరిగింది. ఆదివారం వేద పండితులు ప్రత్యేక పూజలు ఆచరించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ప్రభుత్వ విప్ నియోజకవర్గ ఎమ్మెల్యే బెందాళం అశోక్ పూజల్లో పాల్గొని పూజలు జరిపించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు జన్నెల సంతోష్, తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ల జయదేవ్, రెయ్యి జానకిరావు, కొరాయి ధర్మరాజు, ఊనా సంతోష్, మాజీ ఎంపీపీ దక్కత డిల్లీరావు, ఎస్.కోటి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా మహాయజ్ఞం

పురుషోత్తపురం గ్రామంలో జరుగుతున్న మహాయజ్ఞం వేడుకగా జరుగుతుంది. ఆదివారం జరిగిన యజ్ఞానికి సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు వచ్చి పూజలు నిర్వహించుకున్నారు. ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ యజ్ఞంలో పాల్గొని పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను గ్రామ పెద్దలు సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు టీడీపీ నాయులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.


స్వామివారి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే అశోక్

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఎచ్చెర్ల, మే 11(ఆంధ్రజ్యోతి): కుశాలపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చికిత్సపొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. కుశాలపురం గ్రామానికి చెందిన సీపాన రవికుమార్(45) గతంలో పలు సంస్థల్లో సెక్యూరిటీ గార్డుగా పనిచేశాడు.ఆయన మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో శనివారంఉదయం ఇంట్లో ఎవరూలేని సమయంలో మద్యంలో గడ్డి మందుకలిపి తాగి అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్సపొందుతూ ఆదివారంమృతిచెందాడు. రవికుమార్‌కి భార్య రాజేశ్వరి, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.రాజేశ్వరి ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి మృతదేహం గుర్తింపు

పలాసరూరల్,మే11(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరుడఖండి జంక్షన్ సమీపంలో జాతీయరహదారిపై ఆదివారం గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం స్థానికులు గుర్తించారు.ఈవిషయాన్ని కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ క్లీనర్‌కి గాయాలు

రణస్థలం,మే 11(ఆంధ్రజ్యోతి):రణస్థలం షిర్డీసాయి ఆలయం సమీపాన జాతీయరహదారిపై ఆదివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్ కె.కిషాన్ గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. శ్రీకాకుళం వైపు వెళ్తున్న లారీని వెనుక నుంచి వచ్చిన మరో లారీ ఢీ కొనడంతో క్లీనర్ కిషాన్ గాయపడ్డాడు. చికిత్సకోసం 108లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. జేఆర్‌పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదుచేశారు.

బస్సు ఢీకొనడంతో మహిళకు..

పలాసరూరల్,మే11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశుపురం గ్రామానికి చెందిన ఎ.పార్వతి అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆసుపత్రికి వెళ్లి తిరిగి వస్తుండగా ఆదివారం ఆర్టీసీబస్సు ఢీకొనడంతో గాయపడింది. దీంతో స్థానికులు పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు.పార్వతీ ఫిర్యాదుమేరకు కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదుచేశారు.

పెద్దదూగాంలో గడ్డివాముల దగ్ధం

జలుమూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పెద్దదూగాంలో శనివారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో గుండ అప్పలనాయుడుకు చెందిన ఎనిమిది ఎకరాలకు చెందిన గడ్డివాములు దగ్ధమయ్యాయి. అగ్నిప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించడంతో మంటలు అదుపు చేయడానికి వీలుకాలేదు. పశు గ్రాసం కోసం ఉంచిన గడ్డివాములు దగ్ధంకావడంతో పశువులకు ఎలా పోషించాలని అప్పలనాయుడు వాపోతున్నాడు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు



పలాస: కేటీరోడ్డులో వాహనం తనిఖీ చేస్తున్న సీఐ సూర్యనారాయణ

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు సూచించారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా బస్టాండ్లల్లో అనుమానితల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు జంక్షన్లల్లో ముమ్మరంగా వాహనాలు తనిఖీచేశారు.

●పలాస,మే11(ఆంధ్రజ్యోతి):నెంబరు ప్లేట్లు లేని అనధికార, లైసెన్స్ లేని, మద్యం సేవించి తిప్పే వాహనాలను సీజ్ చేస్తామని కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ హెచ్చరించారు. ఆదివారం కాశీబుగ్గ బస్టాండ్, పలాస, మొగిలిపాడు,కోసంగిపురం రహదారులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పాకిస్థాన్‌తో యుద్ధం నేపథ్యంలో ప్రత్యేకడ్రైవ్ నిర్వహించి వాహనాలు సోదా చేస్తున్నామన్నారు.అనుమానస్పదంగా తిరిగే వ్యక్తులు తారాసపడితే సమాచారం ఇవ్వాలని కోరారు. వాహనాలు నడిపే సమయంలో నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించడంతో పాటు లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

● నరసన్నపేట, మే 11(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, సత్యవరం, జమ్ము జంక్షన్‌ల్లో సీఐ జె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. కొత్తవ్యక్తుల సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఆర్టీసీ కాంప్లెక్‌లో ప్రయాణికులు బ్యాగ్‌లు, పార్సిల్ కేంద్రాల్లో వస్తువులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సింహాచలం పాల్గొన్నారు.

●పాతపట్నం,మే11(ఆంధ్రజ్యోతి):పాతపట్నంలో ఎస్‌ఐ బి.లావణ్య ఆధ్వర్యంలో ఆదివారం బస్టాండ్,ఆలాంద్రరోడ్, కోర్టుకూడలితో పాటు పట్టణంలోని పలుప్రధాన కూడళ్లలో వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికులు బ్యాగులు, వ్యాపారప్రదేశాలను పరిశీలించారు.

●కొత్తూరు,మే11(ఆంధ్రజ్యోతి): అపరిచిత వ్యక్తులు, అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని కొత్తూరు సీఐ సీహెచ్ ప్రసాద్ కోరారు. కొత్తూరు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో తనిఖీలు నిర్వహించారు.

హనుమంతు వాహనంపై వేంకటేశ్వరుడు

నరసన్నపేట, మే 11(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఐదురోజులుగా జరుగుతున్న శ్రీనివాసుని బ్రహ్మోత్సవాల్లో భాగం ఆదివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ప్రధాన అర్చకులు చామర్తి కృష్ణమాచార్యులు, మావుడూరి జగదీష్‌బాబు ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవతో స్వామివారి మేలుకొలుపు నిర్వహించి అనంతరం అభిషేకాలను జరిపించారు.భక్తుల దర్శనార్థనం మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. పట్టణ వీధుల్లో హనుమంతు వాహనంపై శ్రీనివాసుడు కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో కోమట్ల సంఘ నాయకులు జామి వెంకట్రావు, ఆలయ ధర్మకర్త పి.కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

నరసింహ స్వామి జయంతి వేడుకలు

జలుమూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) శ్రీముఖలింగంలో కొలువు తీరిన శ్రీలక్ష్మి నరసింహస్వామి జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఉదయం అర్చకులు విశ్వనాథదాస్, ప్రసాద్ పాడి నేతృత్వంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం బెల్లం పానకాలు భక్తులకు పంచిపెట్టారు.

మజ్జి గౌరమ్మ ఆలయ వార్షికోత్సవం

కాశీబుగ్గ, మే 11 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గలోని నర్సిపురం కాలనీలో వెలసిన మజ్జి గౌరమ్మ తల్లి ఆలయం ద్వితీయ వార్షికోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి అభిషేకాలు,హోమాలు,ప్రత్యేక పూజలు, భజనలు జరిపారు. కార్యక్రమంలో కృష్ణ, శోభారాణి, బాలేశ్వరి, పార్వతి, కృష్ణవేణి, సంగీత పాల్గొన్నారు.

పాలపోలమ్మతల్లి ఉత్సవాలు

నందిగాం, మే11(ఆంధ్రజ్యోతి):మండలంలోని కొత్తగ్రహారంలో పాలపోలమ్మ తల్లి గ్రామదేవత ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో దేవరను మేళతాళాలు మధ్య గ్రామంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ సందర్భం గా మహిళలు ముర్రాటలతో వెళ్లి అమ్మవార్లకు చల్లదనాలుచేశారు. పాలపోలమ్మతో పాటు నీలమ్మతల్లి,పాతపట్నం అమ్మతల్లి, భూలోకమ్మలకు ముర్రాటలు సమర్పించారు.

●టెక్కలి, మే 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అయోధ్యపురంలో పాలపోలమ్మతల్లి గ్రామదేవత సంబరాలు 22 ఏళ్ల తరువాత ప్రారంభమయ్యాయి. గ్రామంలో అమ్మ వారిని ఘటాలతో ఊరేగించారు. చుట్టాలు, బంధువులతో గ్రామం కలకలలాడుతోంది.

నిఘా లేదు.. నిబంధనలు పాటించరు

●వాహనచోదకులు, ప్రయాణికులకు అగచాట్లు● లారీల్లో ఇష్టారాజ్యంగా ఇసుక తరలింపు ● చోద్యంచూస్తున్న అధికారులు



రాగోలు సమీపంలో ఇసుకపై పరదా కప్పకుండా లారీలో తరలిస్తున్న దృశ్యం

జిల్లాలోని వంశధార, నాగావళి నదులు, వాగుల, గెడ్డల నుంచి ఇసుక అక్రమ రవాణా అవుతోంది. ఇసుక తరలింపుపై కనీసం రెవెన్యూ, భూగర్భ, గనులు, రవాణా, పోలీసుశాఖల నిఘా కొరవడింది. లారీలు, ట్రాక్టర్లపై రవాణా చేసే సమయంలో పాటించాల్సిన కనీస నిబంధనలు సైతం బేఖాతర్ చేస్తున్నారు. ఇసుక తరలించే సమయంలో ఎగరకుండా పైభాగంలో టార్పాలిన్లు కప్పాలి. వాహన చోదకులు, ప్రయాణికుల కళ్లలో ఇసుక రేణువులు పడకుండా చర్యలు తీసుకోవల్సిన నిర్వాహకులు కనీస నిబంధనలు పట్టించుకోవడంలేదు.

ఆమదాలవలస, మే 11 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస మండలంలోని నాగావళి నది పరిధిలోని నిమ్మతొర్లాడ, ముద్దాడపేట, బూర్జ మండలంలోని ఖండ్యాం, వంశధారనదిలో ఆకులతంపుర, దొంపాక ర్యాంపు నుంచి నిత్యం వందలాది లారీల్లో ఇసుక విశాఖపట్నం తదితర ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఇసుక రవాణాకు ప్రభుత్వం విధించిన నిబంధనలు పాటించిన తర్వాతే తరలింపునకు అనుమతి ఇస్తుంది. అయితే జిల్లాలోని అనుమతిపొందిన నదులు,వాగుల్లోని ర్యాంపుల నుంచి ఇసుక తరలింపునకు వాహనయజమానులు నిబంధనలు పాటించడం లేదు. ప్రధానంగా ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఇసుక రవాణా చేయాలి. దీనికితోడు ర్యాంపు నుంచి వాహనం ఎక్కించే సమయంలో ఇసుకపై భాగం తడపాలి. టార్పాలిన్లు కప్పి జనావాసాల్లో ఇసుక ఎగర కుండా అన్ని చర్యలు తీసుకోవాలి. ఇలా ఎటువంటి నిబంధనలు పాటించకుండా ప్రతిరోజూ20 వరకు వాహనాల్లో రవాణా అవుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడంలేదని జోరుగా ఆరోపణలొస్తున్నాయి. నిత్యం కళింగపట్నం- శ్రీకాకుళం-పార్వతీపురం ప్రధాన రహదారిలో నాగావళి నది నుంచి విశాఖపట్నం రాత్రి, పగులు తేడాలేకుండా వందలాది వాహనాల్లో ఇసుక తరలిస్తున్నారు. ఇసుకపై భాగంలో టార్పాలిన్లు వేయకపోవడంతోపాటు అతి వేగంగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. తక్షణమే ఇసుక తరలించే సమయంలో వాహనాలపై భాగంలో టార్పాలిన్లు కప్పి కళ్లలో పడకుండా చర్యలు తీసుకోవాలని ద్విచక్రవాహన చోదకులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి

● గురుకులాల్లో సమస్యలపై అధ్యయనం చేయించాలి

● రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకుల డిమాండ్



రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

కాశీబుగ్గ, మే 11(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్‌చేశారు. ఆదివారం పలాస రైల్వే ఇనిస్టిట్యూట్‌లో జిల్లా దళిత సంఘాల సంయుక్త మండలి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటుచేశారు.ఈ సందర్భంగా కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్క కృష్ణయ్య, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి వినోద్,ఎన్‌జీవోస్ నాయకులు గోపాల్ మాట్లాడుతూ గురుకులాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బందిని తక్షణమే భర్తీ చేయాలని కోరారు.కొరత ఉన్న చోట నూతన భవనాల నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్‌చేశారు. నీటి సౌకర్యంలేని,బాత్‌రూములు పనిచేయని క్వార్టర్లకు హెచ్‌ఆర్‌ఏ కట్ చేయడం నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు.డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో నెలకొన్న దుస్థితిపై దళిత మంత్రులు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు నోరువిప్పాలని కోరారు. 1983లో ఉమ్మడి రాష్ట్రంలో గురుకులాలు ఏర్పాటుచేసిన భవనాలే నేటికీ ఉన్నాయని, అవి పాడవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. జిల్లా స్థాయి అధికారులు మొక్కుబడిగా తనిఖీలు చేస్తున్నారని, ప్రజాప్రతినిధులు పూర్తిగా పట్టించుకోవడంలేదని వాపోయారు.బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఉన్న సమస్యలపై ప్రత్యేక కమిటీతో అధ్యయనం చేయించాలని కోరారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఎటువంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు.కార్యక్రమంలో ప్రభాకర్, గోపి, ధర్మారావు, కరుణాకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు: 2007-08లో కుడుము జడ్పీ పాఠశాలలో చదివిన విద్యార్థులు



గార: జడ్పీ ఉన్నత పాఠశాలలో 2004-05లో పదోతరగతి చదివిన విద్యార్థులు

చాలా మారిపోయావురా..

● జిల్లాలోని పాఠశాలల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు

'ఏంచేస్తున్నావు.. ఎక్కడ ఉంటున్నావ్.. పిల్లలు ఏం చదువుతున్నారు. చాలా మారిపోయావురా. గుర్తుపట్టలేకపోయాను' ఇలా పూర్వ విద్యార్థులు ఒకరినొకరు పలకరించుకొని గత మధురస్మృతులు నెమరవేసుకున్నారు. ఆదివారం జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

●కొత్తూరు, మే11(ఆంధ్రజ్యోతి): కుడుము జడ్పీ ఉన్నత పాఠశాలలో 2007-08లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో సరదాగా గడిపారు. అనంతరం ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి

●కాశీబుగ్గ, మే 11 (ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధిలో గల చినబాడాం జడ్పీ ఉన్నత పాఠశాలలో 2002-03లో చదువుకున్న పదోతరగతి చదివిన విద్యార్థులు కలుసుకున్నారు. తమతో పాటు చదువుకున్న ఆరుగురు మృతిచెందడంతో వారికి నివాళులర్పించారు. పాఠశాల అభివృద్ధికి రూ.50వేలు అందజేశారు.

●గార, మే 11(ఆంధ్రజ్యోతి): గార జడ్పీ ఉన్నత పాఠశాలలో 2004-05 సంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో వీరంతా కలుసుకుని ఆనాటి సంగతులను గుర్తుచేసుకున్నారు. అలాగే అప్పటి గురువులను సత్కరించారు.

●కవిటి, మే 11(ఆంధ్రజ్యోతి): రాజపురం జడ్పీఉన్నత పాఠశాలలో 1998-2003లో చదివిన విద్యార్థులు ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. ఒకరికి ఒకరు యోగక్షేమాలు తెలుపుకొని,అనాటి ఉపాధ్యాయులను సత్కరించారు.

●సరుబుజ్జిలి, మే 11 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పురుషోత్తపురం జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి 1993-94 బ్యాచ్ విద్యార్థుల పాఠశాల ఆవరణలో సమావేశం నిర్వహించారు. వారి కాలంలో బోధించిన అధ్యాపకులు శిమ్మినాయుడు, మల్లేశ్వరరావు, పేరి శ్రాస్తిలకు ఘనంగా సత్కరించారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

●జి.సిగడాం,మే 11(ఆంధ్రజ్యోతి): జి.సిగడాం, సంతవురిటి ఉన్నత పాఠ శాలల్లో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. జి.సిగడాం ఉన్నతపాఠశాలలో 1996- 2001 బ్యాచ్, సంతవురిటి ఉన్నత పాఠశాలలో 1996-97 చదివిన విద్యార్థులు ఆత్మీయ కలియక కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులను, వివిధ హోదాల్లో ఉన్న స్నేహితులను ఘనంగా సత్కరించారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

● పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

ఎల్.ఎన్.పేట, మే 11(ఆంధ్రజ్యోతి) గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధే చేయడమే ప్రభుత్వధ్యేయమని పాతపట్నం ఎమ్మెల్యే మామిడిగోవిందరావు తెలిపారు. ఆదివారం చింతలబడవంజలో టీడీపీనాయకుడు చింతాడ శ్రీనివాసరావు అనారోగ్యంతో బాధపడుతుండడంతో పరామర్శించారు. ఈసందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ గతప్రభుత్వంలో గ్రామీణప్రాంతాల్లో రోడ్లు, తాగునీటిసౌకర్యం కల్పించకపోవడంతో ప్రజలు ఇబ్బందులకుగురయ్యారని తెలిపారు.కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మనోహర్‌నాయుడు, కె.చిరంజీవి,నాయకులు వి.గోవిందరావు, కె.కృష్ణమాచారి,పోలినాయుడు, వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

● పలాస ఎమ్మెల్యే శిరీష



లింబుగాంలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

హరిపురం, మే11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సీఎం చంద్రబాబు కృషిచేస్తున్నారని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. ఆదివారం మందస మండలంలోని లింబుగాంలో మూడు సీసీరోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రహదారులే పల్లెలకు అభివృద్ధి సూచికలని తెలిపారు. వైఎస్సార్ రహదారులకుసనేసినకోసిన గ్రామాల్లో తమ ప్రభుత్వం అభివృద్ధి బాటలు వేస్తోందని తెలిపారు. అనంతరం కమలపురం గ్రామానికి వెళ్లే రహదారి రైల్వే బాగంలో ఉండడంతో గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. ఈ విషయాన్ని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జీకే నాయుడు, బావన దుర్యోధన, దానని తాతారావు, రట్టి లింగరాజు, మండల అధ్యక్షుడు, బమ్మిడి కర్రయ్య, పొట్టి మోహనరావు, రామారావు, బొంగు దామోదరం పాల్గొన్నారు.

'కూర్మా'నికి కష్టకాలం

(ఐదో పేజీ తరువాయి)

కొద్దిపాటి తాబేళ్లకుగానూ చిన్నపార్కు ఏర్పాటు చేయగా.. ప్రస్తుతం వాటి సంఖ్య పెరగడంతో ఇరుకుగా మారుతోంది. విశాలమైన స్థలం లేకపోవడంతో తాబేళ్లు తరచూ అనారోగ్యానికి గురవుతున్నాయి. విశాలమైన స్థలంలో తాబేళ్ల పార్కును ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. ఈ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వైద్య సేవలు అందిస్తున్నారు

ఆరోగ్యం బాగోలేని వంద తాబేళ్లను పశువైద్య శాఖాధికారులు పరిశీలించిన తర్వాత వైజాగ్‌లో జూపార్కుకి తీసుకెళ్లాం.అక్కడ యానిమల్ రెస్క్యూ సెంటర్‌లో ప్రత్యేక వైద్యులు పర్యవేక్షణలో వైద్య సేవలు అందిస్తున్నారు. శ్రీకూర్మంలో తాబేళ్ల సంరక్షణకు విశాలమైన స్థలం అవసరం ఉంది. దీనికోసం ఆలయ అధికారులు తగు ఏర్పాట్లు చేయాలి.

- ఎ.వెంకటేష్, జిల్లా అటవీశాఖ అధికారి

శభాష్.. భరత్‌చంద్ర

(ఐదో పేజీ తరువాయి)

సబ్జెక్టుల్లో ఎంపికైనా వెళ్లలేకపోయాడు.

శ్రీకాకుళంలో నివాసం..

భరత్‌చంద్ర తండ్రి రామకృష్ణ విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలంలో ఉన్న మెరైన్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గాపనిచేస్తున్నారు. తల్లి దమయంతి శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలంలోని బెలమం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారు. తమ్ముడు రోహిత్ చంద్రకృష్ణా జిల్లా గుడివాడలోని ఓ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. విద్యార్థి తల్లిదండ్రులు శ్రీకాకుళం పట్టణం తిలక్‌నగర్‌లో నివసిస్తున్నారు.ప్రస్తుతం భరత్‌చంద్ర హైదరాబాద్‌లో ఉన్నాడు. కాగా మదర్స్‌డే రోజున తన కుమారుడు మంచి బహుమతి ఇచ్చాడని విద్యార్థి తల్లి దమయంతి ఫోన్‌లో 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. కుమారుడికి స్వీటు తినిపించి సంతోషాన్ని పంచుకుంది.

టీడీపీ నాయకుడికి నివాళి

పోలాకి, మే 11(ఆంధ్రజ్యోతి): పోలాకిలో టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి లుకలాపు రాంబాబు అంత్యక్రియలు ఆదివారం నిర్వహించారు. అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, టీడీపీ నాయకుడు బగ్గు రాజీవ్, కిల్లివేణు, పార్టీ మండలాధ్యక్షుడు ఎంవీ నాయుడు, ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ విలపించారు. ఈసందర్భంగా రాంబాబుకు నివాళులర్పించారు.

●జలుమూరు (సారవకోట) మే 11 (ఆంధ్రజ్యోతి): సారవకోట, బొంతు కూడలిలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ధర్మాన తేజకుమార్ ఏర్పాటుచేసిన చలివేంద్రాలను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుపతిరావు, సింహాచలం, నాగరాజు, గణేష్, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీ కళావేదిక పురస్కారాల ప్రదానం

టెక్కలి,మే 11(ఆంధ్రజ్యోతి):టెక్కలికి చెందిన విశ్రాంత అధ్యాపకులు మూల తాతయ్య, దూసి ఆంధ్రాస్టాలిన్‌కు ప్రపంచ తెలుగు సాహితీ సంబరాల్లో భాగంగా ఆదివారం ఏలూరుకు చెందిన శ్రీశ్రీ కళావేదిక సాహితీ పట్టాభిషేక మహోత్సవాలు పురస్కరించుకొని పురస్కారాలు అందజేశారు. తెలుగుభాష,సాహిత్యం, వైభవం,సంస్కృతి, సంప్రదాయాలు, కళలు పరిరక్షణకు కళారంగం ద్వారా వీరుచేస్తున్న కృషిని గుర్తించి కళా కిరీటి జాతీయ ప్రతిభా పురస్కారాలు ఆ సంస్థ చైర్మన్ కత్తిమండ ప్రతీప్‌కుమార్, కన్వీనర్ కొల్లి రమాదేవి ప్రదానంచేశారు.

వెయ్యి రోజులకు చేరిన ఆహారం పంపిణీ

టెక్కలి,మే 11(ఆంధ్రజ్యోతి):ఆకలితో అలమటిస్తున్న అన్నార్తులకు అభయం ఫుడ్ బ్యాంక్ రోజుకు 40 నుంచి 50మంది వరకు ఆహారపు పొట్లాలు అందిస్తోంది.ఈ మేరకు ఆదివారం వెయ్యిరోజులకు చేరుకుంది. దాతల సహకారంతో రూ.23లక్షల ఆహారాన్ని ఫుడ్‌ప్యాకెట్ల ద్వారాపేదలకు అందజేశారు. జన్మదినం, వివాహ మహోత్సవాలు పురస్కరించుకుని పలువురు అభయంసేవా సంఘానికి ఫుడ్‌ప్యాకెట్లు అందిస్తుండడంతో కార్యక్రమం సజావుగా సాగుతోం దని ఆ సంఘ అధ్యక్షులు శ్రీనివాసరావు తెలిపారు.

సాగుపై యాక్షన్ ప్లాన్

నరసన్నపేట, మే 11(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయం సాగుచేయడం వల్ల భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం మాస్టార్ ట్రైనర్ టి. రమణ తెలిపారు. ఆదివారం దేవాదిలో ప్రకృతి వ్యవసాయం సాగుపై యాక్షన్ ప్లాన్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో రాము, ధర్మాన అసిరినాయుడు,జనార్దనరావు పాల్గొన్నారు.

మదర్స్ డే వేడుకలు

పాతపట్నం మే11(ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తికి ప్రపంచాన్ని పరిచయం చేసిన గొప్ప వ్యక్తి మాతృమూర్తి అని పలువురు వక్తలు తెలిపారు. ఆదివారం కొరసవాడ ఆంధ్రా బాప్టిస్ట్ చర్చిలో మదర్స్‌డే వేడుకను నిర్వహించారు.ఈసందర్భంగా చర్చి పాస్టర్ రెవ. ఎన్ ఫిలిప్‌ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.కార్యక్రమంలో అనిల్‌కుమార్, సతీష్ బెహరా, లారెన్స్, రామారావు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసికోల్లాసం

పోలాకి, మే 11(ఆంధ్రజ్యోతి):ఆధ్యాత్మిక చింతనతో మానసికోల్లాసం లభిస్తుందని తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మప్రచారకర్త పి.రాముస్వామి తెలిపారు. ఆదివారం దండులక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని చింతాడపేట స్వామి రామయోగి సేవాశ్రమంలో నిర్వహించిన సత్సంగ సమావేశంలో మాట్లాడారు. సేవాశ్రమ అధ్యక్షులు బమ్మిడి విశ్వనాథం అధ్యక్షతన జరిగిన సమావేశంలో గీతా విద్యాప్రచారకులు బొడ్డేపల్లి అప్పలనాయుడు, కరుకోల అనంతరావు, సింగుపురం లక్ష్మణస్వామి, ఆంజనేయస్వామి సొండిపేట వారితో భజన ఏర్పాటుచేశారు.

నందిగాంలో 'చదవడం మాకిష్టం'

నందిగాం, మే 11(ఆంధ్రజ్యోతి): నందిగాం శాఖాగ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్నిఆదివారం నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయాధికారి ఉదయ్‌కిరణ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో పుస్తక పఠనం నిర్వహించారు.

రచ్చబండ కూల్చివేతపై ఫిర్యాదు

జలుమూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావిపాడులో గతంలో నిర్మించిన రచ్చబండను కొంతమంది కూల్చివేసి వారి సొంతానికి వాడుకుంటున్నారని ఆన్‌లైన్‌లో ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు ఎంపీటీసీ మాజీ సభ్యుడ బోర సింహాచలం తెలిపారు.గ్రామానికి చెందిన బగ్గు దాలయ్య, బగ్గు జగన్నాథం, బగ్గు మల్లేసు, బగ్గు శాంతారావు, బగ్గు సత్యం, బగ్గు సింహాచలం వారి ఇళ్లకు తోవ మార్గం కోసం మూడు దశాబ్దాల కిందట నిర్మించిన రచ్చబండ కూల్చివేసి ప్లాస్టింగు చేశారని చెప్పారు. కాగా ఈవిషయంపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు.



పాతపట్నంలో పిల్లర్ల స్థాయిలో నిలిచిపోయిన వెల్‌నెస్ కేంద్రం నిర్మాణం

బిల్లులు కాక.. పనులు సాగక

● పిల్లర్ల స్థాయిలో నిలిచిన వైనం

● ఇదీ పాతపట్నంలోని వెల్‌నెస్ కేంద్రం పరిస్థితి

పాతపట్నం, మే11(ఆంధ్రజ్యోతి): పాతపట్నంలోని వెల్‌నెస్ సెంటర్‌కు సంబంధించిన పనులు బిల్లులు కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. కాపువీధి దిగువలో మహేంద్రతనయ నదీ తీరంలో వెల్‌నెస్ కేంద్రం పనులు 2021లో ప్రారంభించారు.జాతీయ గ్రామీణఉపాధిహామీ పథకం, వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన నిధులతో పనులు చేపట్టారు. కొన్ని చోట్ల ఉపాధి మెటీరియల్ నిధులు మంజూరుకావడంతో అక్కడక్కడ భవనాల పనులు పూర్తిచేశారు. అయితే పాతపట్నంలోని వెల్‌నెస్ కేంద్రం పనులకు సంబంధించి పిల్లర్ల వరకు నిర్వహించారు. తర్వాత బిల్లులు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. ప్రజలకు గ్రామస్థాయిలోనే మెరుగైన, కార్పొరేట్ వైద్యసౌకర్యాలు కల్పించాలని వెల్‌నెస్ కేంద్రాలను వైసీపీ ప్రభుత్వం ఏర్పాటుచేసింది. వీటికి సొంత భవనాలు కూడాఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల పాతపట్నంలో పనులు నిలిచిపోయాయి. ఇప్పటికైనా టీడీపీ ప్రభుత్వం ఇక్కడ భవనం పనులు తిరిగి ప్రారంభించి పూర్తిచేసి వెల్‌నెస్ కేంద్రం సేవలు వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.